క్లుప్తంగా

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి




ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని హైదర్‌ఖాన్ నగర్ వాసులు ఉంటున్న గుడిసెలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 23 సంవత్సరాల నుంచి పేదలు అక్కడ గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నా పట్టాలు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. జీఓ నంబర్ 30 ప్రకారం గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని నిబంధనలు చెబుతున్నా ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు చెప్పారు. తక్షణే పట్టాలు ఇవ్వకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. నగర కార్యదర్శులు ఎం.రాజశేఖర్, టి.రాముడు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ పారదర్శకంగా ఉండాలి

కర్నూలు(అగ్రికల్చర్): యూరియాతో సహా అన్ని రకాల ఎరువులు పారదర్శకంగా పంపిణీ చేయాలని ఉమ్మడి జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం సాయంత్రం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని డీసీఎంఎస్ బ్రాంచ్‌ను తనిఖీ చేశారు. బ్రాంచ్‌కు వచ్చిన ఎరువులు వాటి అమ్మకాల వివరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఎరువుల పంపిణీలో పొరపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బిజినెస్ మేనేజర్ రాజేష్, బ్రాంచ్ మేనేజర్ రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు సీఐగా హశ్వంత్‌కుమార్



సీఐగా బాధ్యతలు స్వీకరించిన హశ్వంత్‌కుమార్

ఓర్వకల్లు: స్థానిక ఎయిర్‌పోర్టు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి.హశ్వంత్ కుమార్ నియమితులైనట్లు డైరెక్టర్ విద్యాసాగర్ సోమవారం ఓ ప్రకటన లో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేర కు.. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఎయిర్ పోర్టులో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సన్యాసయ్య విజయవాడకు బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో ఇక్కడే ఎస్‌ఐగా పనిచేస్తున్న హశ్వంత్‌కుమార్‌కు పదోన్నతి కల్పించి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు లు జారీ చేసినట్లు తెలిపారు. ఆ మేరకు సోమ వారం హశ్వంత్‌కుమార్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించినట్లు పేర్కొన్నారు.

బాలిక హత్యాచారం కేసును సీబీఐకి అప్పగించాలి

కర్నూలు (న్యూటౌన్): నందికొట్కూరు నియోజకవర్గం, ముచ్చుమర్రి గ్రామంలో ఏడాది క్రితం జరిగిన బాలిక హత్యాచారం కేసును సీబీఐకి అప్పగించాలని వాల్మీకి బోయ సేవా సంస్థ వ్యవస్థాపకులు కుబేర స్వామి డిమాండ్ చేశారు. సోమవారం వాల్మీకి బోయ సేవా సంస్థ కార్యాలయంలో బాధిత బాలిక ఫ్లెక్సీకి పూలమాలవేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. నేరస్తులకు శిక్ష పడిన రోజే బాలిక ఆత్మకు శాంతి కలుగుతుందన్నారు. వాల్మీకి నాయకులు జె.శ్రీనివాసులు నాయుడు, బేతం కృష్ణుడు, తలారి కృష్ణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గెస్టు ఫ్యాకల్టీకి ఆహ్వానం

ఓర్వకల్లు: స్థానిక ఆర్‌సీ ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్టు ఫ్యాకల్టీగా పని చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గురువయ్యశెట్టి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరానికిగాను ఇంగ్లిష్, గణితం, హిస్టరీ సబ్జెక్టులు బోధించేందుకు అభ్యర్థులు కావాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులకు ఈ నెల 9వ తేదీన డెమో క్లాస్ నిర్వహించనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు తమఒరిజనల్ సర్టిఫికెట్లతో డెమో రోజున ఉదయం 10 గంటలకు హాజరు కావాల్సిందిగా కోరారు.

సంక్షేమ హాస్టళ్ల ఆకస్మిక తనిఖీ



వార్డెన్లు, విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి లీలావెంకటశేషాద్రి

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు జిల్లా కలెక్టరేట్ కాంపౌండ్‌లోని ప్రభుత్వ బీసీ, ఎస్సీ ఆనంద నిలయం హాస్టళ్లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు హాస్టళ్లను తనిఖీ చేసి సౌకర్యాలు, ఆహారం నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను హాస్టల్ వార్డెన్లు సులోచన, రజినమ్మ, శైలజను అడిగి తెలుసుకున్నారు. హాస్టళ్ల రిజిస్టర్‌లను పరిశీలించారు. గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఆహార పదార్థాలు నాణ్యతగా ఉండాలి



మాట్లాడుతున్న ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రాజగోపాల్

కర్నూలు(హాస్పిటల్): ప్రతి వ్యాపారి ఆహార పదార్థాలను నాణ్యతగా ప్రజలకు అందించాలని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రాజగోపాల్ ఆదేశించారు. కేవీజీవీఎం (పాన్ ఇండియా ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ పార్ట్‌నర్) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బళ్లారి చౌరస్తాలోని ఓ హోటల్‌లో ఫుడ్ సేఫ్టీపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రాజగోపాల్ మాట్లాడుతూ.. అందరికీ ఆరోగ్యం ముఖ్యమని, అందుకు మంచి ఆహారం అందించడం ప్రధానమన్నారు. వ్యాపారులు వారి వద్దకు వచ్చే కస్టమర్లకు నాణ్యమైన, శుభ్రమైన ఆహారం అందించినప్పుడే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కలుషిత, అపరిశుభ్ర ఆహారంతో వ్యాధులు వస్తాయన్నారు. ఆహారం తయారీలో కృత్రిమ రంగులు వాడరాదని, వాటి వల్ల జీర్ణకోశ సమస్యలు, అల్సర్లు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయని హెచ్చరించారు. ఇటీవల తాము జరిపిన దాడుల్లో గోబీ మంచూరియా, చికెన్ పకోడి, బేకరీ పదార్థాల్లో కృత్రిమ రంగులు కలుపుతున్నట్లు గుర్తించి జరిమానా విధించామన్నారు. కలుషిత ఆహారం వల్ల ఎవరికైనా అనారోగ్యం ఏర్పడితే సంబంధిత వ్యాపారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆన్‌లైన్ ఆర్డర్లకు పలు హోటళ్లు నిల్వ ఉన్న ఆహార పదార్థాలను వేడి చేసి పంపుతున్నట్లు చెప్పారు. మామిడి పండ్లను కాల్షియం కార్బైడ్‌కు బదులు ఇథిలిన్ గ్యాస్‌తో మగ్గించాలని, ద్రాక్షపై పురుగు మందుల అవశేషాలు పోయేలా ఉప్పు నీటిలో శుభ్రంగా కడిగిన తర్వాతే తినాలన్నారు. ప్రతి వ్యాపారీ ఫుడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని, ఫోస్టాగ్‌తో ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ సర్టిఫికెట్ పొంది ఉండాలన్నారు. అనంతరం జాతీయ ఆహార భద్రత సంస్థ ఆమోదించిన ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ యాక్ట్–2006, 2017 లైసెన్సింగ్, రిజిస్ట్రేషన్ ఫుడ్ బిజినెస్ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ షెడ్యూల్ – 4 ప్రకారం వ్యాపారులకు ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. కేవీజీవీఎం ఫోస్టాక్ సౌత్ ఇండియన్ ఇన్‌చార్జ్‌లు మోహన్‌బాబు, పి.సింధు తదితరులు పాల్గొన్నారు.

కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు



మాట్లాడుతున్న జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు(సెంట్రల్): రేషనలైజేషన్‌లో భాగంగా కొత్త పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు పాణ్యం నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, జేసీ డాక్టర్ బి.నవ్య రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పాణ్యం నియోజకవర్గ రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే గౌరుచరితా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో 1200 మంది ఓటర్లు మాత్రమే ఉండాలని ఎన్నికల కమిషన్ సూచించిన నేపథ్యంలో స్టేషన్లను నవీకరించినట్లు చెప్పారు. అందులో భాగంగా కర్నూలు మండలంలో 14, ఓర్వకల్లు మండలంలో 4, పాణ్యంలో ఒక పోలింగ్ స్టేషన్ పెరిగినట్లు చెప్పారు. పెరిగిన స్టేషన్లన్నీ ఒకే భవన సముదాయంలో వేర్వేరు గదుల్లో ఉంటాయన్నారు. మరోవైపు 18 ఏళ్లు నిండిన యువతీ యువకులందరినీ ఓటర్లుగా నమోదు చేయాలని, ఇందుకోసం రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు, ఓర్వకల్లు తహసీల్దార్ బీవీఎస్ విద్యాసాగర్, గడివేముల తహసీల్దార్ వెంకటరమణ, పాణ్యం తహసీల్దార్ వై.నరేంద్రనాథ్ రెడ్డి, ఎలక్షన్ డీటీ జి.అనురాధ పాల్గొన్నారు.

అధ్యాపకులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు

కర్నూలు సిటీ: నగర శివారులోని జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీలో వారం రోజుల పాటు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి సహకారంతో మానవ రోబో సహకారం – స్థిరీకరించిన వ్యక్తిత్వ వికాసం ఇండస్ట్రీ 5.0 అనే అంశంపై అధ్యాపకులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ట్రిపుల్‌ఐటీ డీఎం ఆచార్యులు డాక్టర్ జె.కృష్ణయ్య, ఐఈఈఈ రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్ (హైదరాబాద్), సొసైటి చైర్మన్ డాక్టర్ జె.సుదర్శన్ కీనోట్ స్పీకర్స్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోబోలు మన దైనందిన జీవితంలో అనేక విధాలుగా సహాయ పడతాయన్నారు. పునరావృతమయ్యే పనులను నిర్వహించడం, రవాణాను సులభతరం చేయడం, ఆరోగ్యాన్ని మెరుగుపరచడం వంటివి చేస్తాయన్నారు. రోబో టెక్నాలజీపై పరిశోధనలతో సరికొత్త టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చుకోగలుగుతామన్నారు. కాలేజీ డీన్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎం.గిరిధర్ కుమార్, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ బి.మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలని బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): జూలై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు కర్నూలు నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సోమవారం ఉదయం కర్నూలులోని సీక్యాంపు సెంటర్ నుంచి పాతబస్టాండ్ వరకు బైక్ ర్యాలీ కొనసాగింది. ర్యాలీని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 8 గంటల పని విధానాన్ని పునరుద్ధరించాలని, ప్రభుత్వ రంగసంస్థల ప్రవేటీకరణను నిలుపుదల చేయాలని, స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలని తదితర ప్రధాన 20 డిమాండ్లతో చేపట్టే సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు చంద్రశేఖర్, వెంకటేష్, రాము, కృష్ణారెడ్డి, సాయిబాబా, నరసింహులు పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ఆలూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వీరేష్ (30) సోమవారం ఉదయం కోలుకోలేక మృతిచెందాడు. ఎస్‌ఐ మహబూబ్ బాషా తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన వీరేష్ ఆలూరు నుంచి అగ్రహారం వెళ్తుండగా బళ్లారి నుంచి కమ్మరచేడు గ్రామానికి వెళ్తున్న ఆటోను ఢీకొన్నాడు. బైక్‌పై వెళ్తున్న వీరేష్ తీవ్రంగా గాయడడంతో ఆలూరు ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. మూడు రోజులుగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం కోలుకోలేక మృతిచెందాడు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

బైక్‌ల ఢీ..ఐదుగురికి గాయాలు

పత్తికొండ రూరల్ : మండలంలోని మండగిరి గ్రామ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు సోమవారం రాత్రి ఢీకొని ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. జె.అగ్రహారం గ్రామానికి చెందిన రామన్నతో పాటు మరొకరు పత్తికొండ నుంచి గ్రామానికి వెళ్తుండగా, మండగిరికి చెందిన అజయ్, చింటు, సాయి మరోబైక్‌పై పత్తికొండకు వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు.

అత్యాచార నిందితుడి అరెస్ట్

ఆదోని రూరల్: ఆదోని పట్టణ సరిహద్దులోని ప్రవళిక గార్డెన్స్ వద్ద ఈనెల 4వ తేదీన బాలికపై అత్యాచారం చేసిన ఆటో డ్రైవర్ సంగిపోగు రమేష్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ నల్లప్ప తెలిపారు. సోమవారం రాత్రి విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. నిందితుడు సంగిపోగు రమేష్ ను మండలంలోని కడితోట క్రాస్ వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. నిందితుడిని పట్టుకునే విషయంలో చాకచక్యంగా వ్యవహరించిన ఆదోని రూరల్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, హెడ్‌కానిస్టేబుల్ జానీవాకర్, పీసీలు కాశీం, సురేష్, కాశీలింగం, శ్రీనివాస్‌లను అభినందించారు.

ఉరుకుందలో భక్తుల సందడి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రం భక్తులతో సందడి నెలకుంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. కొందరు భక్తులు ఆలయ ఆవరణలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం

నంద్యాల: మండలంలోని అయ్యలూరు మెట్ట వద్ద సోమవారం రాత్రి మోటార్‌సైకిల్, లారీ ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా తెలిపిన వివరాల మేరకు.. రుద్రవరం మండల ఎల్లవత్తుల గ్రామం ఆర్‌ఎంపీ రమేష్, మరో వ్యక్తి కలిసి మోటార్‌సైకిల్‌పై నంద్యాల వైపు వెళ్తున్నారు. అయ్యలూరు మెట్ట వద్దకు చేరుకోగానే గిద్దలూరు వైపు వెళ్తున్న లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. రాత్రి 11 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలో విద్యుత్ శాఖకు సంబంధించి అభివృద్ధి పనులు జరుగుతున్నందున ఈ నెల 8న పలు ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా 11 కేవీ సిరినో బుల్ పరిధిలోని సుంకేసుల రోడ్డు, సంజీవని హాస్పిటల్, ఎంఆర్‌సీ ఫంక్షన్ హాల్ ఏరియా, 11 కేవీ ఎన్‌ఆర్ పేట ఫీడర్‌లలో ఎన్‌ఆర్ పేట, సంకల్‌బాగ్, మున్సిపల్ ఆఫీసు, ఎస్వీ కాంప్లెక్స్ ఏరియాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

సమ్మెకు సీపీఐ సంపూర్ణ మద్దతు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ఉద్యోగ వ్యతిరేక విధానాలు నిరసిస్తూ జూలై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తక్షణమే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 8 గంటల పని విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అన్ని వర్గాల ప్రజలు సమ్మెకు మద్దతు ఇవ్వాలని కోరారు.

బీజేపీ కుట్రలను ప్రజలకు వివరించండి

కర్నూలు(సెంట్రల్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేయాలని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నంద్యాల డీసీసీ అధ్యక్షుడు, కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ లక్ష్మీనరసింహ యాదవ్ అధ్యక్షతన నంద్యాల జిల్లా నియోజకవర్గ కో–ఆర్డినేటర్లు, నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్రాల బీజేపీ ప్రభుత్వాల తీరుపై గ్రామ స్థాయి నుంచి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. జిల్లా, మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలని, నంద్యాల జిల్లా పార్టీ, నియోజకవర్గాల కార్యాలయాలను ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తానని చెప్పారు. అలాగే కర్నూలు జిల్లా పార్టీ నాయకుల సమస్యలను పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు.

మొహర్రం వేడుకల్లో వివక్ష తగదు

కర్నూలు(సెంట్రల్): మొహర్రం వేడుకల్లో కుల వివక్ష మంచిది కాదని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు హితవు పలికారు. ఆయన సోమవారం కేవీపీఎస్ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ.. జిల్లాలో అధికారుల నిర్లక్ష్యంతో కొన్ని చోట్ల కుల వివక్ష స్పష్టంగా కనిపిస్తోందన్నారు. పెద్దకడబూరు మండలం మురవనిలో ఇరువర్గాల యువకులు కులం పేరుతో దూషించుకోవడం అన్యాయమన్నారు. ఇలాంటి కుల దురహంకారాలు మళ్లీ చోటు చేసుకోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు వైఎస్సార్ జయంతి కార్యక్రమాలు

కర్నూలు (టౌన్): దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.15 గంటలకు స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఎస్టీబీసీ కళాశాల కమిటీ హాలులో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

15న ఆట్యా- పాట్యా ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియంలో ఈ నెల 15న ఉదయం 10 గంటలకు ఉమ్మడి జిల్లా స్థాయి ఆట్యా–పాట్యా ఎంపిక పోటీలు, టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు జిల్లా ఆట్యా- పాట్యా సంఘం కార్యదర్శి నాగరత్నమయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–17 విభాగంలో బాలుర, బాలికలు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. టోర్నమెంటులో విన్నర్స్, రన్నర్స్, మూడవ స్థానంలో నిలిచిన జట్లకు ట్రోఫీ, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు 93938 55460 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు



ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులను గజమాలతో సన్మానిస్తున్న కార్యకర్తలు

కర్నూలు (టౌన్): పార్టీ కోసం పనిచేసే వారికి వైఎస్సార్‌సీపీలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కిషన్ సోమవారం సాయంత్రం ఎస్వీమోహన్ రెడ్డి, విజయ మనోహరి దంపతులను గజమాలతో సత్కరించారు. అలాగే శాలువా కప్పి, స్వీటు తినిపించారు. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ.. జిల్లాలో పార్టీ మరింత బలపడిందన్నారు. జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి, గ్రామ స్థాయిలో పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను గుర్తించి సముచిత గౌరవం కల్పించినట్లు చెప్పారు. అన్ని నియోజవర్గాల్లో అన్ని క్యాడర్లలో పార్టీ నాయకులను నియమించామన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఒక సైనికుడిలా కిషన్ పనిచేశారని గుర్తు చేశారు. కార్యకర్తలను వైఎస్సార్‌సీపీ ఎన్నటికీ మరువదని, ప్రతి ఒక్కరికీ న్యాయం చేసే దిశగా కృషి చేస్తున్నామన్నారు. అంతకుముందు రాష్ట్ర పదవి దక్కిన కిషన్ ఎస్వీ కాంప్లెక్స్ నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 'జోహార్ వైఎస్సార్' అంటూ నినాదాలు చేశారు.

రోడ్లు, డ్రైనేజీలు నిర్మించండి



కమిషనర్ రవీంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న కాలనీల వాసులు

కర్నూలు (టౌన్): నగరంలోని విఠల్ నగర్ సవారమ్మ గుడి వద్ద రహదారులు, మురుగు కాల్వలు నిర్మించాలని స్థానికులు పి.వెంకటేశ్వరరావు, మద్దిలేటి, బాలాజీ, రాముడు విన్నవించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు కమిషనర్ రవీంద్రబాబును కలిసి వినతిపత్రాలు అందజేశారు. ప్రజల నుంచి వచ్చిన 19 ఫిర్యాదులను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, పాల్గొన్నారు.

ఫిర్యాదులు ఇవే..

- స్టాంటన్ పురం ఏ– టు– జెడ్ ఫంక్షన్ హాలు వెనుక ప్రాంతంలో డ్రైనేజీ కాల్వలు నిర్మించాలని స్థానికులు పవన్‌కుమార్ విన్నవించారు.
- బాబా బృందావన్ నగర్‌లో తాగునీటి సరఫరా మెరుగు పరచాలని, పిచ్చి మొక్కలు తొలగించాలని స్థానికులుకె.వి.క్రిష్ణారెడ్డి, జయప్రకాష్ విన్నవించారు.

ఐరన్ ఓర్ లీజును రద్దు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పుల్లగుమ్మి రైతులు

కర్నూలు(సెంట్రల్): వెల్దుర్తి మండలం పుల్లగుమ్మి రైతులకు నష్టం కలిగించే ఐరన్ ఓర్ లీజును తక్షణమే రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో బాధిత గ్రామ రైతులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరాలుగా 83 మంది రైతులు పొలాలు సాగు చేసుకుంటుండగా సీతారామయ్య అనే ఐరన్‌ఓర్ యజమాని వాటిని ఖాళీ చేయాలని ఇబ్బంది పెడుతున్నట్లు చెప్పారు. రైతుల మాట వినకపోవడంతో పొలాలపై దుమ్ముధూళి వదిలి పంటలు పండకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని రెవెన్యూ, మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు చెప్పారు. గతంలోనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా తీసుకున్న చర్యలు శూన్యమని, తమ సమస్యను పరిష్కరించకపోతే ఆత్మహత్యలు తప్పా మరో మార్గం లేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. పుల్లగుమ్మి వాసులు మద్దిలేటి, రంగస్వామి, శ్రీనివాసులు, పెద్ద లక్ష్మన్న, రాముడు,ఎల్లయ్య పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు శెట్టి

కర్నూలు (హాస్పిటల్): డెంగీ వ్యాధి పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డెమో శ్రీనివాసులు శెట్టి చెప్పారు. సోమవారం స్థానిక వడ్డెగేరిలోని 25వ సచివాలయం అంగన్‌వాడీ కేంద్రంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ.. డెంగీ నివారణ గురించి పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో, గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డెంగీ వ్యాప్తి చెందకుండా ప్రతి శుక్రవారం ఫ్రైడే – డ్రై డే కార్యక్రమం నిర్వహించాలని, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా అవగాహన కల్పించాలన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, ప్రశాంతి, రాజేశ్వరి పాల్గొన్నారు.

14న విద్యుత్ సౌధ ముట్టడికి పిలుపు



ఇందిరాగాంధీ నగర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ జూలై 14న విద్యుత్ సౌధను ముట్టడించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు టి.రాముడు తెలిపారు. సోమవారం 43వ వార్డు ఇందిరాగాంధీ నగర్‌లో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత మీటర్లు ఉండగా కొత్తగా స్మార్ట్ మీటర్లు ఎందుకని ప్రశ్నించారు. కేవలం ఆదానీ కోసం స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని, వాటితో కరెంట్ బిల్లులు విపరీతంగా పెరిగిపోతాయన్నారు. మంత్రి లోకేష్ ప్రభుత్వాన్ని కనుసైగతో శాసిస్తున్నారని, పాదయాత్రలో స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగులగొట్టాలని చెప్పిన ఆయన ఇప్పుడు మిన్నకుండిపోవడం అన్యాయమన్నారు. వెంటనే ఆయన కలుగజేసుకొని కూటమి ప్రభుత్వం బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని డిమాండ్ చేశారు.

అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే చర్యలు



కోడుమూరులో ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: దుకాణదారులు అధిక ధరకు ఎరువులను విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ హెచ్చరించారు. సోమవారం కోడుమూరులోని ఎరువుల దుకాణంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఎరువులకు సంబంధించి రికార్డులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఏఓ మాట్లాడుతూ మండలంలో యూరియా కొరత లేదని, అలాగే రైతు సేవా కేంద్రాలకు 220 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరైందని, త్వరలోనే రానుందని చెప్పారు.

గూడూరులో..

గూడూరులోని ఎరువుల దుకాణాల్లో సోమవారం ఏఓ దస్తగిరి రెడ్డి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి ఎరువుల స్టాక్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మండలంలో ఎక్కడా యూరియా కొరత లేదని, ఎవరైనా దుకాణదారులు కృత్రిమ సృష్టిస్తే చర్యలు తప్పవని ఏఓ హెచ్చరించారు.

ఘనంగా గ్యారతాలీఖ్ వేడుకలు



స్వామి వారి సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో సోమవారం గ్యారతాలీఖ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. మొహర్రం పండుగ కలిసి రావడంతో భక్తులు అధికంగా వచ్చారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.